సాక్షి విశాఖపట్నం

సోమవారం। 16। సెప్టెంబర్। 2024



గాజువాక..మజాకా

టాలీవుడ్‌లో గాజువాక యువత దుమ్మురేపుతోంది. హీరోలుగా, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా, కొరియోగ్రాఫర్లగా రాణిస్తున్నారు. 8లో



పరారై... గంజాయితో చిక్కాడు

కొద్ది రోజుల కిందట పీఎంపాలెం పోలీస్ స్టేషన్ నుంచి పరారైన నిందితుడు గంజాయితో పోలీసులకు దొరికిపోయాడు. 8లో



శ్రీ అర్ధనారీశ్వర గణపతిగా సంపత్ వినాయగర్ 8లో

న్యూస్‌రీల్

నార్త్ ఏసీపీగా అప్పలరాజు



అల్లిపురం: నార్త్ ఏసీపీగా ఎస్.అప్పలరాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెయిటింగ్‌లో ఉన్న అతన్ని నార్త్ ఏసీపీగా నియమిస్తూ రాష్ట్ర హోం శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. 1991 బ్యాచ్‌కు చెందిన అప్పలరాజు విశాఖలో పలు పోలీస్ స్టేషన్లలో సీఐగా, ఇంటెలిజెన్స్ డీఎస్పీగా, అనకాపల్లి డీఎస్పీగా పని చేశారు.

మూట్ కోర్టు పోటీల విజేత సిద్ధార్థ లా కాలేజీ



మూట్ కోర్టు విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పీఎంపాలెం: ఆళ్వార్‌దాస్ నేషనల్ మూట్ కోర్టు పోటీల్లో విజయవాడ సిద్ధార్థ లా కళాశాల విజేతగా నిలిచింది. పీఎంపాలెంలోని ఎన్‌వీపీ లా కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 24 బృందాలు పాల్గొన్నాయి. 15 మంది విశ్రాంత న్యాయమూర్తులు మూట్ కోర్టు జడ్జీలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో విజయవాడ సిద్ధార్థ లా కళాశాల విద్యార్థుల బృందం విజేతగా నిలిచి రూ.30 వేలు, ట్రోఫీని అందుకుంది. హైదరాబాద్ పండే కంటి లా కళాశాల విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. నగరానికి చెందిన విశ్రాంత న్యాయమూర్తి ధర్మారావు, బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు రవీంద్ర ప్రసాద్ విజేతలకు బహుమతులు అందించారు. ఎన్‌వీపీ లా కళాశాల చైర్మన్ ఎస్‌వీహెచ్‌హెచ్ రాజేంద్ర, కరస్పాండెంట్ రవీంద్ర, బోర్డు డైరెక్టర్ డాక్టర్ విజయ రవీంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికా దాస్ పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం దివీస్ భారీ విరాళం



మంత్రి లోకేష్‌కు చెక్కు అందిస్తున్న దివీస్ సీఈవో దివి కిరణ్

తగరపువలస: వరద బాధితులను ఆదుకునేందుకు దివీస్ సంస్థ భారీ విరాళంతో ముందుకు వచ్చింది. దివీస్ సీఈవో దివి కిరణ్ ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి నారా లోకేష్‌ను కలిసి రూ.5 కోట్ల చెక్కును అందజేశారు. ఈనెల 1 నుంచి 8వ వరకు వరద బాధితులకు ఆహారాన్ని అందజేసేందుకు గాను అక్షయపాత్ర ఫౌండేషన్‌కు మరో రూ.4.8 కోట్లను దివీస్ సంస్థ అందజేసింది.

నేడు ఏయూకి సెలవు

అల్లిపురం: మిలాద్ ఉన్ నబీ పండగను పురస్కరించుకొని ఆంధ్ర యూనివర్సిటీకి సోమవారం సెలవు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ఈ.ఎన్.ధనుంజయ్‌రావు తెలిపారు. సోమవారం ఏయూకు సెలవు లేదని సోషల్ మీడియాలో ప్రచారం చేసినట్లు తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారం వారిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ర్యాంకు వచ్చినా సీటు రాలేదు



నీట్‌లో ర్యాంకు వచ్చినా రాష్ట్రంలో మెడికల్ సీట్లు తక్కువగా ఉండటంతో సీటు రాలేదు. అందుకే లాంగ్ టెర్మ్ కోచింగ్ తీసుకుంటున్నా. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో నీట్‌కు చాలా ఎక్కువ పోటీ ఉంటుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు ఇచ్చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది. ఎంతో కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల కలలు నెరవేరేలా ప్రభుత్వం మేలు చేయాలి. అన్యాయం చేయకూడదు.

– ఎస్ కార్తీక్, విద్యార్థి, పెద్దగదిలి




విద్యార్థుల ఉసురు పోసుకోవద్దు



నీట్ ర్యాంకు సాధించిన విద్యార్థులకు సీట్లు రాకుండా చేయడం దారుణం. వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో వైద్య కళాశాలల నిర్మాణం జరగలేదని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి తప్పించుకునే ధోరణిలో మాట్లాడడం విడ్డూరంగా ఉంది. కళాశాలల్లో రెండో ఏడాది విద్యార్థులకు తరగతులు జరగడం లేదని.. మాజీ సీఎం జగన్‌పై విష ప్రచారాలు చేయడమే మంత్రులు ప్రధాన పనిగా పెట్టుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మెడికల్ కళాశాలలు మూత పడేలా చేస్తే.. పేద విద్యార్థుల పరిస్థితి దారుణంగా తయారవుతుంది. వారి ఉసురు పోసుకోవద్దు.

– పాత్రపిల్లి సునీల్‌కుమార్, జ్ఞానాపురం

ఆ పోస్టు ఖరీదు రూ.3 కోట్లు



- అంతకు మించి ఇచ్చేందుకు సిద్ధమన్న ఓ అధికారి
- రాష్ట్ర స్థాయిలో లాబీయింగ్
- అధికార పార్టీ నేతలు, మధ్యవర్తులతో ప్రయత్నాలు
- రాష్ట్రంలోనే హాట్ సీటుగా.. మధురవాడ సబ్ రిజిస్ట్రార్ పోస్టు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

మధురవాడ సబ్ రిజిస్ట్రార్ పోస్టు.. రిజిస్ట్రేషన్ శాఖలో ఓ హాట్ కేక్. ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా రూ.3 కోట్ల మేరకు ఇచ్చి మరీ ఈ సీట్లో కూర్చొని చక్రం తిప్పేందుకు ఓ అధికారి సిద్ధమవుతున్నారు. పక్క జిల్లాలోని డిమాండ్ ఉన్న సీట్లో కూర్చొని ఇన్ని రోజులుగా వ్యవహారాలు నడిపిన సదరు అధికారి ఎలాగైనా మధురవాడ సీట్లో కూర్చునేందుకు పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం అధికార పార్టీ నేతలతో పాటు మధ్యవర్తుల ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే స్థానికంగా ఉన్న అధికార పార్టీ నేతలతో మంతనాలు పూర్తి చేసిన సదరు అధికారి... అమరావతి స్థాయిలోని నేతలతో కూడా సీటుకు ఓకే చేయించుకున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ ఎవరైనా తనకంటే ఎక్కువ ఇచ్చేందుకు సిద్ధపడితే అంతకంటే ఎక్కువ మొత్తం ఇచ్చేందుకు తానూ సిద్ధమని ప్రకటించినట్టు సమాచారం. అంతేకాకుండా అమరావతిలో తనకు బాగా పరిచయం ఉన్న ఓ ఐఏఎస్ ద్వారా లాబీయింగ్ చేస్తున్నట్టు కూడా ప్రచారం జరుగుతోంది. సదరు ఐఏఎస్‌కు ఆ శాఖతో సంబంధం లేకపోయినప్పటికీ.. ఆయన ద్వారా అధికార పార్టీ నేతలు, ఉన్నతాధికారుల ఆశీస్సులతో ఎలాగైనా ఆ సీట్లో కూర్చునేందుకు చేస్తున్న ప్రయత్నాలపై ఆ శాఖలోనే చర్చనీయాంశంగా మారింది.

అంతకు మించి...!

ఒకవేళ తాను ఆఫర్ చేసిన రూ.3 కోట్ల మొత్తం కంటే ఎవరైనా ఇంకా ఎక్కువ మొత్తం ఇచ్చేందుకు సిద్ధమని ముందుకు వస్తే పరిస్థితి ఏమిటని కూడా ముందుగానే సదరు అధికారి ఆలోచించుకున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఒకవేళ ఎవరైనా తాను ఆఫర్ చేసిన మొత్తం కంటే ఎక్కువ ఇచ్చేందుకు సిద్ధపడితే... బ్లాంక్‌గా ఎంత మొత్తమైనా ఇచ్చేందుకు నేనున్నాననే సంకేతాలు కూడా పంపినట్టు తెలుస్తోంది. రూ.3 కోట్లే కాదు అంతకుమించి కూడా ఇచ్చేందుకు తాను సిద్ధమని స్పష్టంగా తెలియజేసినట్టు సమాచారం. మరోవైపు ఇప్పటికే ఇక్కడ ఉన్న అధికారి కూడా అదే సీట్లో కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉద్యోగుల సంఘం నేత హోదాలో తనను ఇక్కడే కొనసాగించేందుకు అవకాశం ఇవ్వాలని విన్నవించుకున్నట్టు తెలుస్తోంది. తనకున్న పరిచయాలతో అన్ని విధాలుగా ఇక్కడే కొనసాగేందుకు సదరు అధికారి కూడా గట్టిగానే ప్రయత్నిస్తున్నారు.

సదరు అధికారిపై ఆరోపణలు

వాస్తవానికి పక్క జిల్లాలో కీలకమైన రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న సదరు అధికారిపై అనేక ఆరోపణలున్నాయి. ప్రభుత్వ భూములు, దేవదాయశాఖ భూములు ప్రైవేటు సంస్థలకు అప్పగించినట్లు పలు వివాదాలున్నాయి. అంతేకాకుండా వివాదాల్లో ఉన్న భూమిని కూడా తనకు ఎక్కువ మొత్తం ఇచ్చే బిల్డర్స్ సొంతం అయ్యేలా వ్యవహారాలు చక్కబెట్టడంలో దిట్ట. మరోవైపు తన వద్దకు రిజిస్ట్రేషన్ కోసం వచ్చే ఎవరికైనా ఎంత మొత్తం ఇస్తే పనవుతుందో మోహమాటం లేకుండా చెబుతారనే పేరు ఉంది. ఎంత విలువైన భూమి? ఎంత మొత్తం ఇవ్వాలనే వివరాలను ఎటువంటి సంకోచం లేకుండా చెప్పి... ఆ మొత్తం అందిన వెంటనే పనికానిస్తారని కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేర్కొంటున్నారు. విశాఖలోని ఓ కాలనీ కేంద్రంగా సదరు అధికారి నడిపే వ్యవహారాలపై కూడా వార్తలు గుప్పుమంటున్నాయి. మొత్తంగా సదరు అధికారి బ్లాంక్‌గా ఇచ్చే మొత్తంతో హాట్ సీటులో కూర్చుంటారా? లేదా అనేది కొద్ది రోజుల్లోనే తేలనుంది.

అప్పన్న ఆలయంలో పవిత్రాల సమర్పణ



స్వామివారికి పవిత్రాలు సమర్పిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం రాత్రి పవిత్రాల సమర్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను, చక్రపెరుమాళ్లను వేదికపై వేంజేపచేశారు. పవిత్రాలను అర్చకులు శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేశారు. అనంతరం పవిత్రాలకు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులకు, ఆలయ ప్రాంగణాలకు, ఆలయ శిఖరానికి పవిత్రాలను సమర్పించారు. స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పవిత్రవిసర్జన కార్యక్రమం నిర్వహించనున్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై వైఎస్సార్ సీపీ స్టాండ్ ఒక్కటే..

అది ప్రైవేటీకరణకు వ్యతిరేకమే..
- చంద్రబాబు చెబితే కేంద్రం వింటుంది
- మీడియాతో మాజీమంత్రి అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: తెలుగు ప్రజల ఆత్మ గౌరవమైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై వైఎస్సార్ సీపీ స్టాండ్ ఎప్పుడూ ఒక్కటేనని.. అది ప్రైవేటీకరణకు వ్యతిరేకమని మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. 32 మంది బలిదానాలతో ఏర్పడ్డ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు. అప్పుల్లో ఉన్న ప్లాంట్‌ను కావాలని నష్టాల్లో ఉన్నట్లు చూపించి ప్రైవేటీకరణ చేసే కుట్రకు కేంద్ర ప్రభుత్వం దిగిందని ఆరోపించారు. లాసన్స్‌బేకాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూనే వచ్చామన్నారు. అధికారంలో ఉన్నప్పుడు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఎందుకు అడ్డుకోలేదని కూటమి నేతలు విమర్శిస్తున్నారని.. ముఖ్యమంత్రి హోదాలో మా నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏయూ వేదికగా ప్రజల ముందరే.. ప్రధాని మోదీకి ప్రైవేటీకరణ నిలిపి వేయాలని కోరినట్లు గుర్తు చేశారు. టీడీపీ, జనసేన ఎంపీల మద్దతుతోనే కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లిద్దరూ మోదీకి అల్టిమేటం జారీ చేస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిపోతుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం అమ్మకానికి పెట్టినా తమకు ఏమి తెలియనట్లు సీఎం, డిప్యూటీ సీఎం నటిస్తున్నారని దుయ్యబట్టారు. కార్మికులు రోడ్లమీదకు రాకుండా ప్రైవేటీకరణ జరిగితే రాజీనామాలు చేస్తామని ఎంపీ, ఎమ్మెల్యేలతో చెప్పిస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటీకరణ జరగకముందే గట్టిగా పోరాడాలని, ప్రైవేటీకరణ చేసిన తర్వాత రాజీనామాలు చేసినా వృథా ప్రయాసే అవుతుందన్నారు. ఇప్పుడు మాదిరి గతంలో మా ఎంపీలతో ఎన్‌డీఏ ప్రభుత్వం ఆధారపడి ఉండి ఉంటే.. ప్రైవేటీకరణను పూర్తిస్థాయిలో నిలిపివేసేవాళ్లమని స్పష్టం చేశారు.

నేడు జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ పండగను పురస్కరించుకొని కార్యక్రమం రద్దు చేసినట్లు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్ర

- స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు లోకనాథం
- ఉక్కు పరిరక్షణ కోసం సీపీఎం మహాధర్నా



మహాధర్నాలో పాల్గొన్న కార్మిక సంఘాలు, ఉద్యోగులు, సీపీఎం నాయకులు

గాజువాక : స్టీల్‌ప్లాంట్‌ను అదాని, అంబాని వంటి కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టడం కోసమే కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి ప్రభుత్వ రంగంలోనే నడపాలని డిమాండ్ చేస్తూ గాజువాకలో ఆదివారం నిర్వహించిన మహా ధర్నాలో ఆయన ప్రసంగించారు.

స్టీల్‌ప్లాంట్ పూర్తిగా మునిగిపోకముందే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి ప్లాంట్ పరిరక్షణకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని టీడీపీ, జనసేన పార్టీలు ఎన్నికల్లో వాగ్దానం చేశాయన్నారు. అధికారం చేపట్టిన తరువాత కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను రోజురోజుకీ అగాధంలోకి నెడుతుంటే టీడీపీ, జనసేనలు చోద్యం చూడటం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపకపోతే తన పదవికి రాజీనామా చేసి పోరాటంలో దిగుతానని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రకటించారని, దీనివల్ల ఏమాత్రం ఉపయోగం లేదని అన్నారు. ఇలాంటి ప్రకటనలను ప్రజలుగాని, స్టీల్‌ప్లాంట్ కార్మికులుగాని విశ్వసించరని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పాలనకు టీడీపీ, జనసేనలు ఆక్సిజన్ అందిస్తున్నాయని, వారి మద్దతు లేకుండా మోదీ ప్రభుత్వం మనుగడ సాగించలేదన్నారు. ఇంత కీలకంగా ఉన్నా కూడా స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. ప్లాంట్‌ను కేంద్రం ముంచేస్తుంటే నిలువరించకుండా ఇంకెప్పుడు స్పందిస్తారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు, నాయకులు బి.ఈశ్వరమ్మ, జె.అయోధ్యరామ్, కె.ఎం.శ్రీనివాస్, బి.జగన్, పి.మణి, వై.సత్యవతి, యు.రామస్వామి, వై.టి.దాస్, నమ్మి రమణ, ఎస్.రామారావు, స్టీల్‌ప్లాంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్ పాల్గొన్నారు.

‘స్ట్రగుల్’ దందా

- ఏఎన్ఎం, కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల వివాదంలో చలికాచుకుంటున్న గ్యాంగ్
- గుర్తింపు లేని అసోసియేషన్ పేరుతో రుబాబు
- హైకోర్టులో కేసు వేస్తామంటూ ఒక్కొక్కరి నుంచి రూ.500 వసూలు
- సంఘం పేరుతో వైద్యాధికారులపై కూడా పెత్తనం
- ఇప్పటికే వారిపై వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఏఎన్ఎంలు ఫిర్యాదు



విశాఖ సిటీ : ఏఎన్ఎం, కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల రెగ్యులర్ వివాదాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవడానికి ఓ గ్యాంగ్ రంగంలోకి దిగింది. ఊరు, పేరు, గుర్తింపు లేని అసోసియేషన్ పేరుతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై పెత్తనం చేస్తోంది. ఏఎన్ఎంలకు స్టాఫ్‌నర్సులుగా పోస్టింగ్‌లు ఇవ్వకుండా హైకోర్టులో కేసు వేస్తామంటూ ఒక్కో స్టాఫ్‌నర్సు నుంచి డబ్బు వసూలు చేస్తుండడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇదిలా ఉంటే ఈ అసోసియేషన్ పేరుతో చెలామణి అవుతూ అందరినీ రెచ్చగొడుతున్న ప్రధాన సూత్రధారి అసలు కాంట్రాక్టు నర్సింగ్ విభాగానికి చెందిన వాడే కాదన్న విషయం చర్చనీయాంశమవుతోంది.

గుర్తింపు లేని అసోసియేషన్ పేరుతో..

ఏఎన్ఎంలుగా ఉన్న వారికి జీఎన్ఎం శిక్షణ ఇచ్చి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సుల స్థానాల్లో వీరి సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీవో నెంబర్ 115 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు గాను అదనంగా రూ.5 వేలు ప్రోత్సాహకం ఇవ్వనున్నట్లు ఆ జీవోలో పేర్కొంది. ప్రస్తుతం కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్న వారు భవిష్యత్తులో శాశ్వత ఉద్యోగ అవకాశాలు దూరమవుతాయని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వారు గత కొద్ది రోజులుగా ఆందోళన చేపడుతున్నారు. ఇదిలా ఉంటే ఈ వివాదం ద్వారా డబ్బు దండుకోడానికి ఒక బ్యాచ్ పక్కా ప్లాన్‌ను సిద్ధం చేసుకుంది. గుంటూరుకు చెందిన ఒక వ్యక్తి, స్థానికంగా కేజీహెచ్‌లో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న మరొకరితో జతకలిసి దందాకు తెరతీశారు. రెండు, మూడు సార్లు గుర్తింపు లేని స్ట్రగుల్ కమిటీ పేరుతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై చిందులు తొక్కిన సందర్భాలు ఉన్నాయి. తద్వారా కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల మెప్పుపొందే ప్రయత్నం చేశారు.

రూ.57.5 లక్షలు వసూలుకు ప్లాన్

ప్రభుత్వం ఇచ్చిన జీవోపై హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకువస్తామని, దానికి ఖర్చు అవుతుందని అందరినీ మభ్యపెడుతున్నారు. ఇందుకోసం ఒక్కొక్కరు నుంచి రూ.500 వసూలు చేయడం ప్రారంభించారు. రాష్ట్రంలో సుమారు 11,500 మంది కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు ఉన్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.500 చొప్పున రూ.57.5 లక్షలు వసూలు చేయడానికి సిద్ధమయ్యారు. అయితే ఈ దందాపై కొంత మంది మాత్రం వ్యతిరేకత చూపుతున్నారు. ఈ కమిటీకి ఎటువంటి గుర్తింపు లేకపోవడమే కాకుండా, అందులో నాయకుడిగా ఉన్న వ్యక్తి అసలు కాంట్రాక్టు నర్సింగ్ విభాగానికే చెందిన వాడు కాదన్న విషయం స్టాఫ్‌నర్సుల్లో చర్చ జరుగుతోంది. అలాగే ఆ కమిటీ లెటర్‌హెడ్‌పై వేరే అసోసియేషన్ రిజిస్ట్రేషన్ నెంబర్ ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు తమకు సంబంధించిన వ్యక్తికి డబ్బు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. అయినప్పటికీ కేజీహెచ్‌లో ఉన్న ఒక కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ద్వారా డబ్బు వసూలుకు ఒత్తిడి తీసుకువస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. డబ్బు ఇవ్వని వారికి ఎటువంటి సమస్య వచ్చినా తాము పట్టించుకోమని బెదింపులకు పాల్పడినట్లు తెలిసింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో డబ్బు చెల్లిస్తున్నారు. ఈ స్ట్రగుల్ కమిటీకి ట్రెజరీగా చెప్పుకుంటున్న కేజీహెచ్‌లో కాంట్రాక్టు స్టాఫ్ నర్సు ఖాతాలోకి డబ్బులు వెళుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ నెల 17వ తేదీన విజయవాడలో ఆరోగ్య శాఖ కమిషనర్ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులతో సమావేశాన్ని నిర్వహించనున్నారు. దీనికి గుర్తింపు ఉన్న సంఘాల నుంచి సభ్యులు మాత్రమే హాజరవ్వాలని స్పష్టం చేశారు. ఈ స్ట్రగుల్ కమిటీకి గుర్తింపు లేకపోవడంతో ఇతర యూనియన్లలో తమ పేర్లను చేర్చాలని ప్రాధేయపడుతున్నట్లు తెలిసింది.




కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్‌కు ఫిర్యాదు చేస్తున్న ఏఎన్ఎంలు (ఫైల్)

మేల్ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుపై ఏఎన్ఎంల ఫిర్యాదు

ఒకవైపు పోస్టింగ్‌లు, దందాల వివాదం నడుస్తుంటే.. మరోవైపు కేజీహెచ్‌లో మేల్ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న కోటేశ్వరరావు వ్యవహారం వివాదాస్పదమవుతోంది. తమను వ్యక్తిగతంగా దూషిస్తున్నాడని ఏఎన్ఎంలు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుతో పాటు డీఎంఈకి కూడా ఫిర్యాదు చేశారు. జీవో నెంబర్ 115ను ప్రభుత్వం విడుదల చేసిన తరువాత ఏఎన్ఎంలపైన, ప్రభుత్వంపైన అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆ ఫిర్యాదులో ఆరోపించారు. అతడిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు ద్వారా విజ్ఞప్తి చేశారు.

గంగమ్మ ఒడికి గణనాథులు








బీచ్‌రోడ్డు/అల్లిపురం: విఘ్నాలను తొలగించే గణనాథుడి విగ్రహాలు ఆదివారం గంగమ్మ తల్లి ఒడికి చేరాయి. వినాయక చవితి సందర్భంగా 9 రోజుల పాటు పూజలు చేసిన వినాయక విగ్రహాలను ప్రజలు సముద్రంలో నిమజ్జనం చేశారు. విగ్రహాల నిమజ్జనం కోసం జీవీఎంసీ ఫిషింగ్ హార్బర్, జాలారిపేట, కోస్టల్ బ్యాటరీ, జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్, రుషికొండ, ఐటీసెజ్, భీమిలి, పినగాడి చెరువు, సరిపల్లి శివాలయం చెరువు, రాంపురం చెరువు, యారాడ, అప్పికొండ తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లు చేసింది. ఈ ప్రాంతాలకు నగరంలోని విగ్రహాలను భారీ ఊరేగింపుగా.. డ్యాన్స్‌లు, కేరింతల మధ్య తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. ఆ సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గజఈతగాళ్ల తగిన చర్యలు తీసుకున్నారు. కాగా.. వినాయక నిమజ్జన ప్రాంతాలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సందర్శించారు. నిమజ్జనాల్లో ఎటువంటి అవాంతరాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.







డాక్టర్.. యాక్టర్



గాజువాక నుంచి చిత్రసీమలో మెరిసిన మరో నటుడు డాక్టర్ రవిప్రకాష్. వృత్తి రీత్యా డాక్టర్ అయిన ఈ యాక్టర్ టాలీవుడ్, మాలీవుడ్‌లో 200కు పైగా సినిమాల్లో నటించాడు. రవి ప్రకాష్ పుట్టింది విజయవాడలో అయినా గాజువాక లోనే పెరిగి 2000లో శుభవేళ సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. అనతికాలంలోనే తెలుగు సినీ పరిశ్రమలో మంచి పాపులర్ అయ్యాడు. రవి ప్రకాష్ అగ్ర హీరోలతో కలిసి అనేక సినిమాల్లో నటించారు.

గాజువాక.. మజాకా

ఒక్క చాన్స్ కోసం ఎంతో కష్టపడిన గాజువాక యువత ఇప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో దూసుకుపోతున్నారు. హీరోలుగా, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా, దర్శకులుగా, కొరియోగ్రాఫర్లుగా తమ సత్తా చాటుతున్నారు. ప్రసన్న కుమార్ నంది అవార్డులు అందుకోగా, అఖిల్ కార్తీక్ 17 సినిమాల్లో నటించి హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణిస్తున్నారు. ప్రిన్స్ సెసిల్, డాక్టర్ రవి ప్రకాష్, సునీత వర్మ, ఎఫ్ఎం బాబాయ్ వంటి వారు కూడా తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కొరియోగ్రాఫర్లుగా, దర్శకులుగా కూడా ఇక్కడి యువత రాణిస్తున్నారు. వెంకట్, పండు, రమేష్, ఝాన్సీ వంటి డ్యాన్సర్లు తమ నృత్యాలతో ప్రేక్షకులను అలరిస్తుండగా, కిరణ్ చేబ్రోలు దర్శకుడిగా మెరిసిపోతున్నాడు. అన్ని రంగాల్లోనూ తనకంటూ ప్రత్యేకతను సంతరించుకుని దూసుకెళ్తున్న గాజువాక.. సినీ రంగంలోనూ సత్తా చాటుకుంటోంది. - గాజువాక

టాలీవుడ్‌లో దుమ్మురేపుతున్న గాజువాక యువతరం

ఒక్క చాన్స్‌తో బోలెడు సినిమాలు

హీరోలుగా, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా, కొరియోగ్రాఫర్లగా రాణింపు



సునీతవర్మ

సునీత వర్మ మెరుపులు

వడ్లపూడికి చెందిన సునీత వర్మ దక్షిణ భారతానికి చెందిన నాలుగు భాషల్లో అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. ఇటు సినిమా రంగంలోనూ, అటు మోడల్‌గానూ రాణిస్తున్న ఆమె నీ వెంటే నేనుంటా సినిమాతో తెలుగు తెరకు 2000లో పరిచయమైంది. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం భాషల్లో ఇప్పటివరకు 20 సినిమాల్లో కథనాయికగా నటించింది. వీటికి క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేసిన సినిమాలు అదనం. 2003 వరకు తెలుగు సినిమాల అనంతరం ఆమె తన జర్నీని తమిళ పరిశ్రమకు మార్చింది. 2004లో ఒరు ముర్రై సొల్లువిడు సినిమాతో తమిళ తెరకు పరిచయమై ఆ తర్వాత కన్నడం, మలయాళం భాషల్లో సైతం అవకాశాలను అందిపుచ్చుకుంది. తెలుగు ప్రేక్షకులకు సునీతవర్మగా పరిచయమైన ఆమె మిగిలిన భాషల్లో ప్రేక్షకులకు రాధావర్మ, అంజువర్మ, జనప్రియగా సుపరిచితురాలు.

17 సినిమాల్లో హీరోగా..



దోస్త్ సినిమాతో కెరీర్ ప్రారంభించిన అఖిల్ కార్తీక్ ఇప్పటి వరకు 17 సినిమాల్లో హీరోగా, నాలుగు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించారు. అలా, ప్రామిస్, లైఫ్ స్టయిల్, రామ రామ కృష్ణ కృష్ణ, 2 ఫ్రెండ్స్ వంటి అనేక హిట్ సినిమాల్లో నటించారు. హీరోగా మరో రెండు సినిమాల్లో నటిస్తున్నాడు.

ప్రసన్న నటనకు తొమ్మిది నందులు



1981లో ముద్దమందారం సినిమాతో వెండితెరకు పరిచయమైన ఐ.ప్రసన్నకుమార్ తెలుగు సినీరంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. చంటి సినిమాలో కథానాయికకు చిన్న అన్నయ్యగా అందరికీ సుపరిచితుడయ్యారు. అప్పటి నుంచి సుమారు 200 సినిమాల్లో నటించారు. ప్రతిఘటన, సూపర్ హీరోస్, ఆరంభం, ఒంటరి పోరాటం, అక్కా బాగున్నావా వంటి సినిమాల్లో మంచి పాత్రలను పోషించారు. చిన్నప్పటి నుంచి రంగస్థల నటుడుగా అనుభవం ఉన్న ఆయన పలు టీవీ సీరియళ్లను కూడా నిర్మించి నంది అవార్డులను పొందారు. తెలుగుతోపాటు కన్నడం, ఆంగ్ల సినిమాల్లో కూడా నటించారు. అత్యుత్తమ నటనతో తొమ్మిది నంది అవార్డులను సొంతం చేసుకున్నారు.

యువతరం కథానాయకుడు 'ప్రిన్స్'




ప్రిన్స్ సెసిల్ హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణిస్తున్నాడు. 2012లో నీకు నాకు డాష్ డాష్ సినిమా ద్వారా వెండితెరకు పరిచయమైన ప్రిన్స్ బస్‌స్టాప్, రొమాన్స్, బన్నీ అండ్ చెర్రీ, మనసును మాయ సేయకే, వేర్ ఈజ్ విద్యా బాలన్, డాలర్స్ కాలనీ, నేనూ శైలజ, డీజే డిల్లు తదితర సినిమాల్లో నటించాడు. అటు హీరోగా.. ఇటు క్యారెక్టర్ ఆర్టిస్టుగా మంచి ప్రతిభ ప్రదర్శిస్తున్నారు.

సినిమాల్లో కూడా బాబాయే..



జర్నలిస్టుగా సుదీర్ఘ కాలం గాజువాకలో పని చేసిన దాడి త్రినాథ స్వామి ప్రస్తుతం పలు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. జర్నలిజం నుంచి రేడియో జాకీగా మారిన త్రినాథ్‌స్వామి ఎఫ్.ఎం.బాబాయ్‌గా అందరికీ సుపరిచితుడు. సినిమాల్లో ఆయన పోషించే పాత్రల పేరు కూడా ఎక్కువగా బాబాయ్‌గానే ఉంటాయి. ఒకపక్క సినిమాల్లోనే నటిస్తూనే మరోపక్క ఔత్సాహికులకు ఆయన శిక్షణ కూడా ఇస్తున్నారు.

లుక్స్ రాజశేఖర్.. పండు మనోళ్లే





ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ లుక్స్ రాజశేఖర్ ఈ ప్రాంతానికి చెందినవాడే. అనేక సినిమాలకు ఆయన డ్యాన్స్ మాస్టర్‌గా పని చేయడంతోపాటు ఎందరో డ్యాన్స్ మాస్టర్లను తయారు చేశాడు. ఇదే కోవకు చెందినవాడు డ్యాన్స్ మాస్టర్ పండు. ఈటీవీలో ప్రసారమవుతున్న ఢీ, శ్రీదేవి డ్రామా కంపెనీతోపాటు వివిధ షోలకు కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. వివిధ సినిమాలకు కూడా ఆయన కొరియోగ్రాఫర్‌గా పని చేసి మంచి పేరు తెచ్చుకున్నాడు. డ్యాన్స్ మాస్టర్ రమేష్, ఝాన్సీ తదితరులు ఈ ప్రాంతం నుంచి వెళ్లి అవకాశాలు సంపాదిస్తున్నారు. వీరి జోడీ ఎంత ప్రాచుర్యం పొందిందో తెలిసిందే.

వెండితెర 'స్వీటీ'

రంగస్థలం డ్యాన్స్ కార్యక్రమాల్లో ఓ వెలుగు వెలిగిన స్వీటీ ప్రస్తుతం సినిమా నటిగా స్థిర పడింది. గొంతినవానిపాలేనికి చెందిన ఈ ముద్దుగుమ్మ సిద్ధూ ఫ్రం శ్రీకాకుళంతో తెలుగు తెరకు పరిచయమైంది. ఇప్పటివరకు పలు సినిమాల్లో నటించిన ఆమె.. సూపర్‌హిట్ మూవీ విక్రమార్కుడులో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ప్రతిభ చూపింది.

జీమా ఏర్పాటు

వందల మంది చలన చిత్ర, టీవీ షో కళాకారులతో గాజువాక మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (జీమా) ఏడాది కిందట ఏర్పాటైంది. ఈ అసోసియేషన్‌లో ఇప్పటివరకు 459 మంది కళాకారులు సభ్యులుగా చేరారు.

డ్యాన్సర్‌గా..యాక్టర్‌గా..



డ్యాన్సర్‌గా, కొరియోగ్రాఫర్‌గా సుపరిచితుడైన విశాఖ థ్రిల్లర్స్ వెంకట్ దర్శకుడిగా కూడా పరిచయమయ్యాడు. వివిధ టీవీ షోలు, రంగస్థలంపై డ్యాన్స్ టీవీ డ్యాన్స్‌తో అలరించిన ఆయన 'వీలైతే ప్రేమిద్దాం' సినిమాతో దర్శకుడిగా మారాడు. జెమినీ టీవీ నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్‌లో విజేతగా నిలవడంతో అదే టీవీలో కొన్నాళ్లపాటు కొరియోగ్రాఫర్‌గా అవకాశం పొందాడు. 26 ఎపిసోడ్‌లకు పని చేశాడు. ప్రముఖ హీరోలు అల్లు అర్జున్, మనోజ్, రాజా, రవితేజ, హీరోయిన్లు శ్రియ, సదా, చార్మీలకు కొరియోగ్రాఫర్‌గా పని చేశాడు. ప్రభాస్‌తో ఒక పాటకు పూర్తిస్థాయి కొరియోగ్రాఫర్ చేశాడు. శ్రీహరి హీరోగా వచ్చిన భద్రాద్రి సినిమాలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, మిస్డ్‌కాల్ సినిమాలో నలుగురు హీరోల్లో ఒక హీరోగా నటించాడు.

ఒక్క ఛాన్స్ కోసం

వీధి డ్యాన్స్‌ల నుంచి నేరుగా సినిమా హీరోగా మారిన యువకుడు లుక్స్ రాజు. వీలైతే ప్రేమిద్దాం సినిమాలో హీరోగా పరిచయమయ్యాడు. ఈ ప్రాంతానికి చెందిన శివ హీరోగా, సెకండ్ హీరోగా రాణిస్తున్నాడు. మిస్డ్ కాల్, వీలైతే ప్రేమిద్దాం, బుల్లబ్బాయి వంటి సినిమాల్లో మంచి ప్రతిభతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రోగ్రాంలతో మంచి గుర్తింపు పొందిన తులసీ రామ్ పలు సినిమాల్లో నటించాడు. వీలైతే ప్రేమిద్దాం, 4జీ వంటి సినిమాల్లో అతడి నటనకు ప్రేక్షకులు నీరాజనం పట్టారు. గాజువాక జోగవానిపాలేనికి చెందిన పల్లా ఆనంద్‌రాజ్ హీరోగా తనను తాను నిరూపించుకున్నాడు. మనుషులతో జాగ్రత్త సినిమాలో కథా నాయకుడిగా చేసిన ఆయన అంతకుముందు ఛత్రపతి, దేశముదురు సినిమాల్లో కూడా నటించాడు. తన స్టెప్పులతో కుర్రకారు గుండెలను పిండేసే డ్యాన్సర్ పండు(పల్లవి) కుందనపు బొమ్మ, చంద్రుడిలో ఉండే కుందేలు వంటి సినిమాల్లో తన సత్తా చాటుకుంది. పలు సినిమాలకు అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన కిరణ్ చేబ్రోలు అయ్యో రామ సినిమాతో డైరెక్టర్‌గా మారాడు. మెహర్‌నగర్‌కు చెందిన లయన్ జగదీష్ దశాబ్ద కాలంగా అసోసియేట్ డైరెక్టర్‌గా పలు సినిమాలకు పని చేశారు.

ఇద్దరిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



యువకులతో లైఫ్‌గార్డ్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతున్న ఇద్దరు యువకులను లైఫ్‌గార్డ్స్ ప్రాణాలతో రక్షించారు. ఒడిశాకు చెందిన నిలాయ్‌షా, మిలాయ్‌షా ఆదివారం మధ్యాహ్నం ఇక్కడ బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు వీరు తీరంలో సరదాగా గడిపి.. స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటం వల్ల ఇద్దరు కొట్టుకుపోతుండగా.. లైఫ్‌గార్డ్స్ సూరాడ నూకరాజు, సతీష్ వీరిని గమనించారు. వెంటనే రంగంలోకి దిగి సురక్షితంగా ఇద్దరినీ తీరానికి తీసుకొచ్చారు. వీరికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

స్టేషన్ నుంచి పరారై... గంజాయితో చిక్కాడు

రైల్వేస్టేషన్ వద్ద నిందితుడిని పట్టుకున్న పోలీసులు

మధురవాడ: కొద్ది రోజుల కిందట పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ నుంచి పరారైన నిందితుడు గంజాయితో పోలీసులకు దొరికిపోయాడు. దీనికి సంబంధించి నార్త్‌జోన్ ఇన్‌చార్జి ఏసీపీ సీహెచ్ పెంటారావు తెలిపిన వివరాలివీ.. గత 11న సెల్‌ఫోన్ దొంగతనం కేసులో ఎర్నింటి కృష్ణబాబును రుషికొండ ప్రాంతంలో క్రైం పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద గంజాయి లభించడంతో దర్యాప్తు కోసం లా అండ్ ఆర్డర్ పోలీసులకు అప్పగించారు. అదే రోజు మధ్యాహ్నం స్టేషన్‌లో పోలీస్ కస్టడీ నుంచి కృష్ణబాబు తప్పించుకున్నాడు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. ఇన్‌స్టా గ్రామ్‌లో నిందితుడు స్నేహితుడితో మాట్లాడిన కాల్ డేటా, చాటింగ్ వివరాలు సేకరించారు. ముందుగా ఆనందపురం మండలం నీళ్ల కుండీలు సమీపంలో అతడి స్నేహితుడిని పట్టుకున్నారు. స్నేహితుడితో కృష్ణబాబుకు ఇన్‌స్టాలో ఫోన్ చేయించి అతను ఉన్న ప్రాంత వివరాలు తెలుసుకున్నారు. విశాఖ రైల్వేస్టేషన్ వద్ద గంజాయి విక్రయించడానికి వెళ్లిన అతన్ని చాకచక్యంగా పట్టుకున్నారు.

వ్యసనాలకు బానిసై.. : విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస సమీపంలోని గొండయ్యపాలేనికి చెందిన కృష్ణబాబు ఇంటర్ వరకు చదివి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. అప్పటి నుంచి చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నాడు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పీఎంపాలెం, డెంకాడ, విజయనగరం పోలీస్ స్టేషన్లలో అతనిపై పది కేసులు నమోదై ఉన్నాయి. భీమిలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో గత మార్చిలో జైలుకు వెళ్లి ఆగస్టులో విడుదలయ్యాడు. జైలులో పరిచయమైన కోనాడ రాంబాబుతో కలసి అరిలోవ ప్రాంతంలో ఓ బైకు దొంగతనం చేశాడు. తర్వాత రుషికొండ ట్రెంచ్ మెరైన్ అపార్ట్‌మెంట్‌లో నాలుగు సెల్‌ఫోన్లు, విజయనగరంలో బైక్, ఆనందపురం ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద బైక్ దొంగలించాడు. వాటిని వెంటనే అమ్మితే పోలీసులకు దొరికి పోతామని భావించి కొమ్మాది శివారు ప్రాంతం దేవిమెట్టలోని పాడుబడిన రేకుల షెడ్‌లో ఉంచాడు. నిందితుడికి స్నేహితుడు రాంబాబు ఇచ్చిన రెండు కిలోల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతన్ని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

బయటపడ్డ బంకర్



వాతావరణ మార్పుల కారణంగా సముద్రం వెనక్కి వెళ్లడంతో విశాఖ సాగరతీరంలో యుద్ధ బంకర్ తిరిగి ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. సముద్ర తీరంలో ఉన్న ఈ బంకర్ ప్రస్తుతం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ముఖ్యంగా చిన్నారులు బంకర్‌ను చూసేందుకు ఎంతగానో ఆసక్తి చూపుతున్నారు. దీని దగ్గర సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు. ఈ బంకర్‌ను చూసేందుకు ఆదివారం నగర ప్రజలు తరలివచ్చారు.

పే..ద్ద చేప!



ఎన్ఏడీ జంక్షన్‌లో ఓ మత్స్యకారుడు పెద్ద చేపను విక్రయానికి తీసుకొచ్చాడు. కాకాని నగర్ వద్ద చెరువులో ఈ చేప లభించినట్లు తెలిపాడు. ఇది తినడానికి రుచిగా ఉంటుందని చెప్పాడు. దీనిని రూ.800కు విక్రయిస్తున్నట్లు వెల్లడించాడు.

భద్రత గోడ కూలిపోతోంది!



బీచ్‌రోడ్డు: అందమైన సాగరతీరంలో నిర్మించిన భద్రత గోడపై సాయంత్రం కూర్చొని అలా సముద్రం చూస్తుంటే మనసు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అయితే ఇప్పుడు ఆ గోడకే ప్రమాదం వచ్చి పడింది. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాలు కారణంగా సముద్ర అలలు ఆర్.కె.బీచ్‌లోని గోడను ఢీ కొట్టాయి. దీంతో కాళీమాత ఆలయం ఎదురుగా గోడ పాక్షికంగా కూలిపోయింది. ఏ క్షణంలో మొత్తం కూలిపోతుందో తెలియని పరిస్థితిలో ఉంది. తక్షణమే గోడకు మరమ్మతులు చేపట్టాలని సందర్శకులు కోరుతున్నారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అనుమానం పెనుభూతమై..

భార్యను హతమార్చిన భర్త



సలోమి మృతదేహం

ఎంవీపీకాలనీ: అనుమానం పెనుభూతమైంది. భార్య ప్రవర్తన సరిగా లేదని భావించిన భర్త ఆమెపై కక్ష పెంచుకొని చున్నీతో ఉరివేసుకొని హత్య చేశాడు. ఈ ఘటన ఆదివారం ఎంవీపీకాలనీ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన డానియేల్, సీలేరుకు చెందిన సిహెచ్.సలోమి (28) 2018లో ప్రేమ వివాహం చేసుకున్నారు. విశాఖలోని నక్కవానిపాలెం శివాలయం వీధిలో ఉంటున్నారు. డానియేల్ ఎండాడలోని ఓ చర్చిలో పనిచేస్తుండగా సలోమి నగరంలోని ఓ హోటల్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు(కవలలు) ఉన్నారు. భార్యపై డానియేల్‌కు అనుమానం ఉండటంతో ఇరువురి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం మరోసారి గొడవ జరగ్గా డానియేల్ చున్నీతో భార్యను హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. సలోని తల్లి వీరి ఇంటికి వచ్చి చూసేసరికి కుమార్తె విగతజీవిగా కనిపించింది. వెంటనే ఆమె ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినీ నటుడు కె.ఎస్.ప్రసాద్ మృతి



ఆరిలోవ: నగరానికి చెందిన సినీ నటుడు కె.ఎస్.ప్రసాద్(66) అనారోగ్యంతో మృతి చెందారు. హనుమంతవాక దరి క్రాంతినగర్‌లో నివాసముంటున్న ప్రసాద్‌కు నటన అంటే ఇష్టం. ఏయూలో ఉద్యోగం చేస్తూ పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రల్లో నటించారు. తొలుత రంగస్థలంపై నాటకాలు ప్రదర్శించారు. నాటక ప్రదర్శనల ద్వారానే ఆయనకు సినిమాల్లో అవకాశాలొచ్చాయి. వివాహ భోజనంబు, జంబలకడిపంబ, కలియుగ పాండవులు, ప్రతిఘటన, సుస్వాగతం తదితర సుమారు 40 సినిమాలలో నటించారు. ప్రసాద్ మూడు నెలల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. అప్పటినుంచి దొండపర్తిలో ఓ అద్దె ఇల్లు తీసుకొని సమీపంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం విషమించడంతో శనివారం రాత్రి ఆయన కన్నుమూశారు. ఆయనకు భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె బుల్లయ్య కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, ఓ కుమారుడు సాఫ్ట్‌వేర్, మరో కుమారుడు సివిల్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ఆయన మరణ వార్త తెలియడంతో పలువురు సంతాపం తెలిపారు.

ఆటో టైరు మార్చుతుండగా ఢీకొన్న లారీ

ఆటో డ్రైవర్ దుర్మరణం ● ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు



మాధవరెడ్డి(ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో జీవీఎంసీ రెండో వార్డు చిల్లపేట, జీరుపేట గ్రామానికి చిల్ల మాధవ రెడ్డి అనే ఆటో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. నగర శివారులోని లంకెలపాలెం నుంచి తగరపువలస సంతలో చాపలు విక్రయించుకునే మహిళలను ఆటోలో తీసుకుని వస్తుండగా శొంఠ్యాం వద్ద వెనుక టైరు పంక్చర్ అయింది. దీంతో ఆటోను రోడ్డుపక్కన నిలిపి టైరు మారుస్తుండగా వెనుక నుంచి వచ్చిన సిమెంట్ లారీ బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలు ఉన్న ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడగా 108 వాహనంలో సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం పూర్తి చేశారు. మృతుని అన్నయ్య వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ పందిరి శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య కొండమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రికీబుయ్ సెంచరీ

విశాఖ స్పోర్ట్స్: దులీప్ ట్రోఫీలో రికీబుయ్ సెంచరీతో మెరిశాడు. ట్రోఫీ రెండో మ్యాచ్‌లో ఇండియా డీ జట్టు 186 పరుగుల తేడాతో ఓడినా రికీబుయ్ సెంచరీతో అదరగొట్టాడు. రెండో ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, 3 సిక్సర్లతో 113 పరుగులు చేశాడు. అనంతపురం వేదికగా జరిగిన ఈ మ్యాచ్ చివరి రోజు 44 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆదివారం ఆటను కొనసాగించిన రికీబుయ్ 50 పరుగుల మార్కును 69 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్సర్‌తో సాధించాడు. 487 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన డీ జట్టు ఓపెనర్ అథర్వ డకౌట్‌గా వెనుతిరిగడంతో రికీబుయ్ ఫస్ట్‌డౌన్‌లో బాటింగ్‌కు దిగాడు. డీ జట్టు 301 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో రికీబుయ్ 23 పరుగులకే చేయగా.. డీ జట్టు 183 పరుగులకు ఆట ముగించింది. ఇండియా ఏ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులు చేయగా రెండో ఇన్నింగ్స్‌ను మూడు వికెట్లకు 380 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది.

శ్రీ అర్ధనారీశ్వర గణపతిగా సంపత్ వినాయగర్

సీతమ్మధార: ఆశీలమెట్టలోని శ్రీ సంపత్ వినాయగర్ స్వామి ఆదివారం శ్రీ అర్ధనారీశ్వర గణపతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో చివరి రోజు కావడంతో ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. గణపతి హోమం, నాదస్వర కచేరీ, ఉభయ దాతలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం వేదసభ, ప్రముఖ వేద పండితులచే చతుర్వేద వేద పారాయణం నిర్వహించారు. అనంతరం పండితులకు ఈవో కె.శిరీష, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సత్కరించారు.

లారస్ ల్యాబ్స్ రూ.కోటి విరాళం



విరాళం అందిస్తున్న లారస్ సీఈవో సత్యనారాయణ

పరవాడ: విజయవాడ వరద బాధితుల కోసం సీఎం సహాయ నిధికి లారస్ ల్యాబ్స్ రూ.కోటి విరాళాన్ని ప్రకటించింది. ఆ విరాళ చెక్కును లారస్ ల్యాబ్స్ సీఈవో డాక్టర్ చావా సత్యనారాయణ దంపతులు సీఎం చంద్రబాబునాయుడును ఆదివారం కలిసి అందించారు. సీఎంని కలిసిన వారిలో లారస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చావా నరసింహారావు ఉన్నారు.

వైద్య పరిశోధనలకు భౌతికకాయం దానం



కేపీ రామానుజం



రామానుజం భౌతిక కాయాన్ని మెడికల్ కళాశాలకు అందిస్తున్న కుటుంబ సభ్యులు

సీతమ్మధార/తగరపువలస: సీతమ్మధారలో నివాసం ఉంటున్న విశ్రాంత అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె.అశ్వత్థ రామానుజం భౌతిక కాయాన్ని ఆయన కుటుంబ సభ్యులు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. శనివారం గుండెపోటుతో మరణించిన రామానుజం శరీరాన్ని ఆదివారం సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలకు అప్పగించారు. ఆయన నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి అందించారు. ఆంధ్రప్రదేశ్ బాడీ డోనర్స్ అసోషియేషన్, సావిత్రీ బాయి పూలే చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహలక్ష్మి సూచనలతో ఆయన కుమారులు కె.శ్రీనివాస్, సూర్యనారాయణరావు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ భౌతిక కాయాన్ని మెడికల్ కళాశాల విద్యార్థుల పరిశోధనలకు వినియోగించనున్నారు. మెడికల్ కళాశాల ఏవో శివప్రసాద్ పాల్గొన్నారు.